# మినీకథ



# మాల్ ప్రాక్టీస్

**ఆ గదిలో శ్మశాన భీభత్స వాతావరణం తాండవిస్తోంది.**

**ఇద్దరు పోలీసులతో అతను ఆ గదిలో చొరబడ్డాడు. హుటాహుటిన ఓ మూలకు వెళ్ళి అక్కడ ఓ కుర్రవాణ్ణిపైకి లేపాడు. అతను సిగ్గుతో బిడియంతో బిక్క చచ్చిపోతూ షర్టు పైకెత్తి చూపించాడు.**

అయినా ఆ ఆఫీసర్‌కి సంతృప్తి కలగలేదు. పెంటు విప్పి చూపమని రంకె వేశాడు. ఆ కురాడు అలావేయక తప్పలేదు. అతనా పని చేస్తోంటే మరో మూల మున్న ఓ అమ్మాయి ముసిముసి నవ్వులు వొలకబోసింది. కందగడ్డలా మారిన ముఖంతో ఆ అబ్బాయి సీట్లో కూలబడ్డాడు. మరో కుర్రాడి భరతం పట్టేందుకు ఆ అధికారి ముందుకు కదిలాడు. అది ఇంటర్ నేషనల్ ఏర్ పోర్ట్ కస్టమ్స్ లాంజ్ కాదు. అక్కడ జరుగుతున్నది స్మగ్లర్ల చెకింగ్ అంతకన్నా కాదు. పోనీ ఆ వచ్చిన వాడు మెడికల్ ఆఫీసర్ కూడా కాదు. ఆ హాల్లో అబ్బాయిల అండర్ వేర్స్ విప్పి చూపిందీ, చేసిందీ వైద్య పరీక్ష కానేకాదు.

ఇంతకీ అది ఇంటర్మీడియెట్ పరీక్షా కేంద్రం!

వచ్చినవాడు ఫల్గుణుడన్నట్లుగా వాళ్ళు ఫ్లయింగ్ స్క్వాడ్ బాపతు మనుషులు. ఆ హాల్లో ఇన్విజిలేషన్ డ్యూటీలో వున్న తెలుగు లెక్చరర్ హిమాంశుకు ఈ తతంగం పరమ రోతగా, అసహ్యంగా వుంది. 'స్క్వాడ్ పేరుతో ఎవరెవరో జీపేసుకు దిగడం, కాలంతో కుస్తీ పడుతూ కలవరపాటుతో పరీక్ష రాస్తున్న విద్యార్థుల్ని చెకింగ్ పేరుతో చొక్కాలు, ప్యాంట్లూవిప్పేసి జేబులు, కాలర్లూ తడిమేసి కకావికాలు చెయ్యడం- ఏదైనా కాగితం ముక్క దొరికితే వెనకా ముందూ చూడకుండా కేసులు బుక్ చెయ్యడం - ఏమిటీ తతంగం? పరీక్ష రాసే విద్యార్థుల్ని ఎందుకలా డిస్టర్బ్ చేయడం?

ఏ సెంటర్లో అయినా కాపీలు కొట్టే వాళ్ళు కొద్ది మందే వుంటారు. అలాంటి వాళ్ళనీ పట్టుకునేందుకు వేరే దారే లేదా? పరీక్ష మధ్యలో సోదా ప్రారంభించి విద్యార్థుల మూడ్ చెడగొట్టడం, అమూల్యమైన కాలాన్ని వృథా చేసి వెయ్యడం నేరం కాదా? హిమాంశు ఇలా మథనపడుతోంటే హాల్లో ఓ మూల నుంచి కేకలు వినిపించాయి. ఉలిక్కిపడి అతను అటువైపు చూశాడు, స్క్వాడ్ ఆఫీసరు ఓ కేసును పట్టుకున్నారు. హిమాంశు వడిగా అటు వైపు నడిచాడు.

"మర్యాదగా ఆ కాగితం ఇచ్చెయ్" స్క్వాడ్ ఆఫీసర్ దబాయిస్తున్నాడు.

"నేను ఇవ్వనుసార్" స్టూడెంట్ మొండి కేస్తున్నాడు. ఆ విద్యార్థిని చూసి హిమాంశు ఆశ్చర్యపోయాడు. అతను హరేన. చాలా తెలివైన, చురుకైన స్టూడెంట్. అలాంటివాడు చిట్టాతో స్క్వాడ్ చేతికి చిక్కడం సిగ్గుచేటనిపించింది హిమాంశుకి.

ఏమిటీ పనీ అన్నట్లు కోపంగా కళ్ళెగురేశాడు.

"సార్! ఓ మారిలారండి" అతను ప్రాథేయపడ్డాడు.

హిమాంశు అతని దగ్గరకు వెళ్ళి చిట్టా ఇచ్చెయ్యమన్నట్టు చేయిచాపాడు. హరేన్ చిట్టా ఇవ్వకుండా బాధగా మొహం పెట్టి మాస్టారుతో ఏదో గుసగుసలాడేడు. "ఏమిటి మీ గుసగుసలు? చిట్టా ఇవ్వమంటే ఇవ్వకుండా ఏమిటీ తాత్సారం? మాస్టారూ మధ్యలో మీరెందుకు జోక్యం చేసుకొంటారు. తప్పుకోండి" స్క్వాడ్ ఆఫీసర్ హిమాంశును నెట్టి వేస్తూ హరేన్ పైకి లంఘించాడు. "అది కాదు సార్. ఇంతకీ అది చిట్టా కాదు! వేరే కాగితం అట" హిమాంశు సర్దబోయాడు. "ఏ కాగితమైనా సరే! జేబులో దొరికితే కేసు బుక్ చెయ్యవలసిందే! మీరు ఊరుకోండి" అంటూ ఆఫీసర్ గారు హరేన్ పిడికిల్ని నొడిసిపట్టుకున్నాడు. పిడికిలి గట్టిగా బిగించి గింజుకోసాగేడు హరేన్. హాల్లోని విద్యార్థులు పరీక్ష రాయడం ఆపి ఈ వింతను చూస్తున్నారు.

చివరికి పోలీసుల బలప్రయోగంతో ఆ కాగితం ముక్క ఆఫీసర్ చేతికి చిక్కింది.

"మర్యాదగా ఇవ్వమంటే ఇవ్వవ్ కదూ? రాస్కెల్! నిన్ను మూడేళ్ళకు కాదు, మూడు తరాలకు డిబార్ చేయిస్తాను చూడు!" సింహంలా గర్జిస్తూ ప్రిన్సిపాల్ రూమ్‌లోకి దూరాడు స్క్వాడ్ ఆఫీసర్.

"మాల్ ప్రాక్టీస్ కింద కేసు రాయండి సార్" అంటూ ప్రిన్సిపాల్‌ని ఆదేశించారు.

"చెప్పండి సార్" అంటూ ప్రిన్సిపాల్ మాల్ ప్రాక్టీసు కేసులు రాసే ఫారమ్ పట్టుకున్నారు.

వివరాలు చెప్పబోతూ ఆఫీసర్‌గారు ఓసారి తన చేతిలో వున్న కాగితం వుండను సాపుచేసి చూశారు- అతనికి నోట మాట రాలేదు.

అది...అది...అది చిట్టా కాగితం కాదు. తన తొందరపాటుకు నాలిక కరుచుకొన్నారు ఆఫీసర్‌గారు.

"ఏమిటి సార్! అంత దీక్షగా చూస్తున్నారు? ఏ గైడ్‌లోంచి చింపుకొచ్చాడేమిటి" ప్రిన్సిపాల్ పరామర్శించారు.

"మీరే చూడండి" నీరసంగా ఆ కాగితం ప్రిన్సిపాల్ చేతికి అందించారు ఆఫీసర్‌గారు.

ఆ కాగితాన్ని ఆసాంతం చదివి ఫక్కున నవ్వారు ప్రిన్సిపాల్.

"సార్! ఇది అబ్బాయి మాల్ ప్రాక్టీస్ కాదు"

"మరి ఇంకెవరిది?" తెల్ల బోయారు స్క్వాడ్ ఆఫీసర్.

"అమ్మాయిది!"

"అమ్మాయిదా?"

"అమ్మాయిది కూడా కాదు! అమ్మాయిలను, అబ్బాయిలను అల్లరి చేసి ఆటలాడించే వయసుది!"

"స్క్వాడ్ ఆఫీసర్ ఏడుపు మొహం పెట్టారు. హరేన్ అందుకున్న ఆ తొలి ప్రేమ లేఖకు పట్టిన దుర్గతికి పగలబడి నవ్వుతున్నారు ప్రిన్సిపాల్.

—తిరుమూరు సుధాకర్ రెడ్డి